## చిన్నమండవ గ్రామ యువకుల మృతి పట్ల
# కాంగ్రెస్ నాయకుల సానుభూతి

**చింతకాని, మహా:** చింతకాని మండలం చిన్నమండవ గ్రామానికి చెందిన కాశిమల చిన్నవెంకటి, సుభద్ర దంపతుల కుమారులు నాగగోపి మరియు నందకిషోర్ నిన్న శుక్రవారం సాయంత్రం మున్నేరు వాగులో ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద సంఘటన గ్రామాన్ని విషాదంలో ముంచింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువకుల మృతితో తల్లిదండ్రులు, సన్నిహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై చింతకాని మండల కాంగ్రెస్ నాయకులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి భౌతికకాయానికి నివాళులు అర్పించి, కుటుంబానికి మద్దతుగా నిలిచారు. ఇద్దరు యువకులను ఒకే సమయంలో కోల్పోయిన తల్లిదండ్రులకు ఆ దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నేత, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు మడిపల్లి భాస్కర్ గౌడ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు, మాజీ ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, పాతర్లపాడు మాజీ ఎంపీటీసీ బొర్రా ప్రసాద్ రావు, కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బసవయ్య, చిన్నమండవ గ్రామ శాఖ అధ్యక్షుడు పరసగాని వెంకట్రాములు, మండల సేవాదళ్ అధ్యక్షుడు పర్సగాని సతీష్, మైనారిటీ నేత ఎస్కే కాసిం, మరీదు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ విషాద ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపగా, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొని యువకులకు కన్నీటి వీడ్కోలు పలికారు.





## తొలి ఏకాదశి శుభాకాంక్షలు: మాజీ ఎంపీ నామ

**ఖమ్మం, మహా:** తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శనివారం నాడు మీడియా కు ప్రకటన విడుదల చేసారు. ఇది తెలుగు సంప్రదాయాల్లో ముఖ్యమైన ఆధ్యాత్మిక పర్వదినమని, పవిత్రతకు ప్రతీకగా పరిగణించబడే ఈ రోజున ఉపవాస దీక్ష, ధ్యానాలు చేయడం ద్వారా మనస్సుకు ప్రశాంతతను కలుగుతుందన్నారు. ఈ రోజు "పేలాల పండుగ"గా కూడా ప్రసిద్ధి చెందిందని, మన ఆచారాలను పాటిస్తూ సత్యము, శాంతి, సేవా మార్గంలో ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిలో ధర్మబద్ధమైన ఆలోచనలు, సత్సంకల్పాలు కలిగించాలని, ఆధ్యాత్మిక చింతనతో పాటు సమాజంలో సేవా భావనను పెంపొందించుకోవాలన్నారు. కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేసి, సంస్కృతి, సంప్రదాయాల పట్ల యువతలో అవగాహన పెంపొందించాలన్నారు. భగవంతుడి అనుగ్రహంతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, ఆనందం లభించాలని ఆకాంక్షించారు.



## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని నిరసన

**వైరా, మహా:** వైరా మున్సిపాలిటీ రెండో వార్డులో అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ముందు శనివారం నిరుపేదలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లుగా తాము పాకలు, రేకుల షెడ్లలో నివసిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వాలని సూచనలు చేసినా, అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. మొదటి లిస్ట్‌లో తమ పేర్లు ఉన్నప్పటికీ, పట్టాలు ఇచ్చే సమయంలో వాటిని తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, నిజమైన అర్హులకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వర్లు, మంజుల వెంకటరమణ, బి.రజిని, అశ్విని, ఉష, మల్లేశ్వరి పాల్గొన్నారు.



## క్లైంట్ ముఖం మీద కనపడే సంతృప్తే
# 10 రెట్ల ఫీజు

### ఐఏఎల్ స్టడీ సర్కిల్‌లో మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

**మధిర , మహా:** కక్షీదారుల సంతృప్తే న్యాయవాదులకు సంతోషదాయకంగా ఉండాలని హైకోర్టు విశ్రాంతి న్యాయమూర్తి జస్టిస్ బి . చంద్రకుమార్ న్యాయవాదులకు పిలుపునిచ్చారు. మధిర లోని రీక్రియేషన్ క్లబ్ లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్ (ఐ ఏ ఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవాదుల శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్ ఇన్ క్రిమినల్ కేసెస్, ప్రొఫెషనల్ ఎథిక్స్ అను అంశాలపై ఉపన్యసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో న్యాయవాదులు ఫీజులే ప్రధానంగా పనిచేస్తున్నట్లు కనిపిస్తుందని దానికంటే క్లైంట్ ముఖం మీద కనపడే సంతృప్తే 10 రెట్ల ఫీజు తో సమానమన్నారు. ప్రస్తుతం న్యాయం కాస్లీ గా మారిందని సామాన్యుడు సుప్రీంకోర్టు మెట్లెక్కే పరిస్థితి లేదన్నారు. ప్రజాస్వామ్యంలో శాసన సభ, న్యాయవ్యవస్థ ,కార్యనిర్వాహక శాఖలలో ఎవరి పాత్ర వారికే ఉంటుందని ఒకరి పాత్రలోకి మరొకరు చొచ్చుకపోకూడదు అన్నారు. శాసన సభ లో ఆమోదం పొంది వచ్చే చట్టాలు ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండాలని లేని యెడల ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందన్నా. రాజ్యాంగంలో సూత్రాలను శాసనసభలో చేసే చట్టాలు పుల్లంగించినప్పుడు న్యాయ వ్యవస్థ కచ్చితంగా న్యాయ సమీక్ష చేయాల్సిందేనన్నారు. న్యాయ సమీక్ష అధికారం కోర్టులకు లేనప్పుడు న్యాయ వ్యవస్థ యొక్క రూపం ప్రజాస్వామ్యంలో కనుమరుగైపోతుందన్నారు. కంప్యూటర్ కాలంలో కూడా భారతదేశంలోని ప్రజలు కోర్టులపై నమ్మకాన్ని పోగొట్టుకోలేదని కొన్ని సందర్భాలలో నిరూపన అయిందన్నారు. ఎప్పుడైతే శాసన కార్యనిర్వాహక శాఖలు న్యాయవ్యవస్థలోకి చొచ్చుక వచ్చి ప్రభావితం చేయాలని చూస్తాయో అప్పుడు ఆ మూడిటి మధ్య ఉన్న సంబంధం తెగిపోతుందన్నారు. న్యాయ వ్యవస్థకు విలువలకు విడదీయరాని బంధం ఉందని నిజాయితీ ,విలువలకు కట్టుబడి ఉన్న వ్యక్తులను న్యాయవ్యవస్థ నెత్తిన పెట్టుకుందని ఆయన అభిప్రాయపడ్డారు. గతంతో పోల్చితే ప్రస్తుతం యువతరం న్యాయవిద్యను చదవటానికి ముందుకు రావటం హర్షించదగ్గ విషయమన్నారు. ఎంతమంది యువ న్యాయవాదులు న్యాయవృత్తిలోకి వస్తే అంత త్వరగా కేసులు పరిష్కారం కావడానికి అవకాశం ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మానవ సంబంధాలు, విలువలు క్రమేణ దూరమవుతున్న ఈ రోజుల్లో న్యాయవాదులు ఉన్నత విలువలతో అందరికీ స్ఫూర్తిని ఇవ్వాలన్నారు . వివాహ బంధాలను తెలుగింపులు అంశాలు కోర్టులలో కేసులు ఎక్కువ ఉండటం దేశానికి మంచిది కాదన్నారు. తద్వారా వివాహ వ్యవస్థ నాశనమై భారతదేశ సారూప్యత దెబ్బతింటుందన్నారు. న్యాయవాదులకు ప్రజాసంధాలు అవసరమన్నారు. సమాజ అభివృద్ధికి చట్టం తోడ్పడుతుందని న్యాయవాదులు బంధుమిత్రులతో సత్సంబంధాలు కొనసాగించాలని, పేదల నివసించే ప్రాంతాలకు వెళ్లి వారికి న్యాయ పరిజ్ఞానాన్ని కల్పించాలని, కార్మికులకు వారి హక్కుల గురించి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఏ ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై ఉదయ భాస్కర్, సహాయ కార్యదర్శి పి. పట్టాభి, సీనియర్ నాయకులు వాసిరెడ్డి వెంకటేశ్వర్‌రావు ,ఐఏఎల్ ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ లతీఫ్ ఓరుగంటి శేషగిరిరావు,కొత్తగూడెం జిల్లా కార్యదర్శి భాగం మాధవరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు పొరుపల్లి అమర్ చంద్, రాష్ట్ర నాయకులు కోటం రాజు, మునిగడప వెంకటేశ్వర్లు ఖమ్మం బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ శాంత కుమారి, ఐఏఎల్ జిల్లా ఉపాధ్యక్షులు తెల్లప్రోలు వెంకటరావు,కాపూరి రమేష్, షేక్ ఇమామ్‌వలి,నెల్లూరి రవికుమార్, గంధం శ్రీనివాసరావు మహిళా కార్యదర్శులు షేక్ నస్రీన్,అరుణ, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోజెండ్ల పుల్లారావు, జింకల రమేష్, ఐఏఎల్ ఖమ్మం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీనారాయణ, ఈ . సతీష్, కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, ఉప్పిసెట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు.




# నిండుకుండలా తాలిపేరు ప్రాజెక్ట్

**మహా భద్రాచలం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో నిన్న మొన్నటి వరకు నీరు లేక వెలవెల బోయిన తాలిపేరు ప్రాజెక్టు ప్రస్తుతం జలకళను సంతరించుకుంది. చర్ల మండలంతో పాటు సరిహద్దు ఛత్తీస్‌గఢ్లో కురుస్తున్న వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టు లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గత మూడు రోజులుగా ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. తాలిపేరు ప్రాజెక్టు 74 మీటర్లు పూర్తి నీటి సామర్థ్యం కాగా శనివారం కి 71.72 మీటర్లకు నీరు చేరుకుంది. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే తాలిపేరు ప్రాజెక్టు నిండుకుండాలా మారనుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పూర్తి ఆయకట్టు 24,700 ఎకరాలు కాగా చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల పొలాలకు సాగు నీరు అందే అవకాశం ఉంది.

